తైక్వాండో పోటీలు



కీసర: విద్యార్థులు తైక్వాండోలో రాణించాల్సిన అవసరం ఉందని, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా తైక్వాండో అసోసియేషన్ ట్రెజరర్ సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం నాగారంలోని కిడ్డీ స్కూల్‌లో విద్యార్థులకు తైక్వాండో పోటీలు నిర్వహించారు. అనంతరం వారికి ఎల్లో బెల్టులను ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ స్వరూప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులో వ్యర్థాలను తొలగించాలి



జవహర్‌నగర్: చెన్నాపురం చెరువులో వ్యర్థాలను తొలగించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యవర్గ సభ్యులు దశరథ్ శనివారం జవహర్‌నగర్ కార్పొరేషన్ మున్సిపల్ మేనేజర్ నగేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెన్నాపురం చెరువు పూర్తిగా కలుషితమవుతుందని, వ్యర్థాలకు ఆవాసంగా మారిందన్నారు. సంబంధిత అధికారులు సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు. నిమ్మల నర్సింహ, జంగయ్య, వెంకటాచారి, లక్ష్మణ్, కిరణ్, బాలయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఘట్‌కేసర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. బాచారంకు చెందిన దినసరి కార్మికుడు బొడిగే విజయ్‌కుమార్ (36) పనికి వెళ్లి తిరిగి శుక్రవారం (ఏపీ29–బీఆర్3079) బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. ఘనాపూర్ సర్వీస్ రోడ్డు మసాల కంపెనీ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన అతడిని స్థానికులు గమనించి 108లో చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మృతి

కీసర: చీర్యాల గీతాంజలి కళాశాలల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ)గా పనిచేస్తున్న నవీన్‌రామ్ గుండెపోటుతో మృతిచెందారు. శనివారం కళాశాలకు చేరుకున్న ఆయన కొంత సమయం తర్వాత ఛాతిలో నొప్పి రావడంతో కళాశాల సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఏవో నవీన్‌రామ్ మృతిపై కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది తీవ్ర సంతాపం ప్రకటించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

అల్వాల్: ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా త్వరలో కానాజీగూడ కల్వర్టు బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అధికారులకు సూచించారు. శనివారం వెంకటాపురం డివిజన్ కానాజీగూడ ప్రధాన రోడ్డుపై నిర్మించిన కల్వర్టు బ్రిడ్జి పనులను ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి పరిశీలించారు. డీసీసీ జనరల్ సెక్రటరీ కృష్ణగౌడ్, నేతలు రమేష్, శేఖర్, కిట్టు, శివ, నరేష్, మధుసూదన్‌గౌడ్, సుదీప్, శ్రీనివాస్‌గౌడ్, భవిత, శశికళ, గాయత్రి తదితరులున్నారు.

యువతి అదృశ్యం



రాధిక

కుషాయిగూడ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. చర్లపల్లి, భరత్‌నగర్‌కు చెందిన బజంత్రీ రాధిక ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. కాగా 29న మెడికల్ షాపునకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు తెలిసిన చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి సోదరుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇలాగైతే ప్రయాణమెలా ?

కుంచించుకుపోతున్న రైల్వేస్టేషన్ రోడ్డు

- సమయానికి చేరుకోలేకపోతున్న ప్రయాణికులు
- పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న వైనం



ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ దారిలో ట్రాఫిక్

ఘట్‌కేసర్: పట్టణం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జఠిలమవుతోంది. రైళ్ల కోసం వెళ్తున్న ప్రయాణికులు సమయానికి రైలును అందుకోలేక నానా అగచాట్లు పడుతున్నారు. మార్కెట్‌కు వచ్చిన మున్సిపాలిటీ ప్రజలు, రైళ్ల కోసం వచ్చిన వారు, ఇతర పనులు కోసం వచ్చిన వారితో ఆ రోడ్డంతా రద్దీగా ఉంటుంది.

దశాబ్దకాలంగా ఇదే సమస్య..

దశాబ్దకాలంగా ఇదే తంతు కొనసాగడంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరిగిపోయింది. గతంలో ఆ రోడ్డులో ఉన్న ఫుట్‌పాత్‌ను తొలగించిన మున్సిపల్ అధికారులు తొలగించి వదిలేశారు. ఓ కంపెనీకి సంబంధించిన వందలాది లారీలు వెళ్లేవని, ఒకేసారి రెండు లారీలు వెళ్లేంత ఉన్న రోడ్డును ఆక్రమించారని స్థానికులు చెబుతున్నారు.

ఇరుకు రోడ్డుతో ఇబ్బంది..

మున్సిపాలిటీలోని పలు ప్రాంతాలు, బస్ టెర్మినల్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ప్రయాణికులకు అందుబాటులో ఉన్న ఏకైక మార్గం ఇదే రోడ్డు. కాగా ఇరుకైన రోడ్డుతో సమస్య మరింత పెరిగిందని వాహనదారులు వాపోతున్నారు.

- కిరాణా జనరల్ స్టోర్లు, బియ్యం దుకాణాలు, హోల్‌సేల్ దుకాణాలు ఇదే రోడ్డు పక్కనే ఉన్నాయి. రైల్వేస్టేషన్‌కు వెళ్లే ఆటోల రద్దీ అదనంగా ఉంటోంది. దీంతో మార్కెట్‌కు వచ్చిన వినియోగదారులతో నిత్యం రోడ్డంతా బిజీగా తయారైంది.

వాహనాల పార్కింగ్..

సరుకులు కొనుగోలు చేయడానికి వచ్చిన వారు తమ వాహనాలను రోడ్డుపైన నిలుపుతుంటారు. కొందరు వ్యాపారులు ఫుట్‌పాత్‌ను సైతం వదలకుండా వస్తువులు రోడ్డుపై వరకు పెడుతుంటారు. హోల్‌సేల్ దుకాణాలకు సరుకులు తెచ్చే వాహనాలు రోడ్డుపై నిలిపి ఖాళీ చేస్తుంటారు. దీంతో రైల్వే ప్రయాణికుల వాహనాలు రద్దీలో ఇరుక్కుపోతున్నాయి.

చిరు వ్యాపారులతోనూ ఇబ్బందే..

కొందరు చిరువ్యాపారులు తమ తోపుడు బండ్లను రోడ్డుపైనే నిలపడంతో కొనుగోలుదారులు రోడ్డు పక్కన నిలుచుండటంతో సమస్య తీవ్రత మరింత పెరుగుతోంది.

- మున్సిపల్ అధికారులు చిరువ్యాపారులకు అనువైన స్థలం చూపాలని, వారు పట్టించుకోకపోవడంతోనే ఈ సమస్య ఏళ్ల తరబడి నానుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు విస్తరణను చేపట్టి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలి..



గతంలో ఓ కంపెనీకి చెందిన వందలాది లారీలు నిత్యం రాకపోకలు ఈ రోడ్డుపైనే సాగించేవి. రెండు భారీ వాహనాలు ఒకేసారి వెళ్లేంత స్థలం ఉండేది. రోడ్డు కబ్జాకు గురై ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీనిపై అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ చేపట్టాలి.

– కిశోర్‌గౌడ్, స్థానికుడు

చిన్నారులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరం



సమావేశంలో పాల్గొన్న స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్

కీసర: చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, సలహాలు, సూచనలు ఎంతో అవసరమని, అవి వారి అభివృద్ధికి దోహదపడతాయని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్–రాంపల్లి స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం స్కూల్‌లో నిర్వహించిన పీటీఏ ఎన్నిక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యాబోధన, సాంకేతికత, పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాల గురించి ప్రతి పండగ విశేషాలను తెలియజేసే స్పెషల్ అసెంబ్లీ గురించి (పీపీటీ) పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌తో విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం తరగతుల వారీగా తల్లిదండ్రులను పీటీఏ ప్రతినిధులుగా ఎన్నుకున్నారు. ఎన్నికైన పీటీఏ 2025–2026 విద్యా సంవత్సరానికి ఆయా కమిటీల్లో ప్రతినిధులు, సభ్యులుగా కొనసాగుతారన్నారు. స్కూల్ హెచ్ఎం కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు సెలక్షన్స్

కీసర: అండర్–14,17 కేటగిరిలో కీసర–కాప్రా జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు సెప్టెంబర్ 2న కీసర బండ్లగూడలోని స్వామి నారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సెలక్షన్లు జరగనున్నట్లు జోనల్ కార్యదర్శి మనోహర్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ ఎంపికకు హాజరయ్యే వారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, బోనఫైడ్, తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 9440880447, 9678370549.

నిలిచిన రిజిస్ట్రేషన్ సేవలు !

మేడ్చల్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంటర్నెట్ సమస్యతో గత మూడు రోజులుగా రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి. దీంతో రిజిస్ట్రేషన్ల కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇంటర్నెట్ వైర్ల తొలగింపు కారణంగా సమస్య నెలకొనడంతో పరిష్కారంపై అధికారులు దృష్టి సారించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాగా నిత్యం డాక్యుమెంట్ల తయారీలో బిజీగా ఉండే డాక్యుమెంట్ రైటర్లు రిజిస్ట్రేషన్లు స్తంభించడంతో ఖాళీగా మారారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు వెంటనే ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఆర్థికసాయం

రామంతాపూర్ : కృష్ణాష్టమి వేడుకల్లో జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన సురేష్‌యాదవ్ కుటుంబానికి శనివారం రామంతాపూర్ చికెన్‌షాప్ అసోసియేషన్ రూ. 20,000 ఆర్థిక సాయం అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు వరుణ్‌యాదవ్, అనంత్‌రెడ్డి, జాకీర్, చందూ, ఖురేషి తదితరులున్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న హెచ్ఆర్‌డిసీఎల్ ఎస్ఈ. శ్రీనివాస్

కీసర: నాగారం–యనంపేట వరకు సుమారు రూ.247 కోట్ల నిధులతో చేపడుతున్న రహదారి విస్తరణ పనులను శనివారం హెచ్ఆర్‌డీసీఎల్ ఎస్.ఈ శ్రీనివాస్ పరిశీలించారు. నాగారం–యనంపేట రహదారి విస్తరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని, దీంతో ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు కలుగుతున్న ఇబ్బందులను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ చీఫ్ సెక్రటరీ ఇలంబర్తిని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జశ్రీనివాస్‌గౌడ్‌లు కలిసి వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం రోడ్డు విస్తరణ పనులను ఎస్ఈ పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని నిర్వాహకులను ఆదేశించారు. నవంబర్ నెలాఖరులోగా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని చెప్పారు.

వ్యాపారికి బెదిరింపులు.. !

పలువురు రిపోర్టర్లపై కేసు.. ఇద్దరి రిమాండ్

సాక్షి, మేడ్చల్‌జిల్లా : మట్టి వ్యాపారిపై బెదిరింపులకు పాల్పడిన ముగ్గురు రిపోర్టర్లపై శామీర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లాకు చెందిన మట్టి వ్యాపారి చాగర్ల శివకుమార్ మూడుచింతలపల్లి మండలం అనంతారం గ్రామంలో మట్టి వ్యాపారం సాగిస్తుంటాడు. కాగా శామీర్‌పేట్‌కు చెందిన ముగ్గురు రిపోర్టర్లు పలుమార్లు వారిని బెదిరించి డబ్బులు వసూలు చేయసాగారు. అంతటితో ఆగకుండా గత మార్చి నెలలో మరోసారి లారీలను అడ్డగించి డబ్బులు వసూలు చేయడంతో పాటు ఫారెస్ట్ అధికారులతో లారీని సీజ్ చేయించి వ్యాపారికి నష్టం కలిగించారు. ఇలా పలుసార్లు వ్యాపారిపై సదరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడటంతో మనస్థాపానికి గురైన వ్యాపారి జూన్‌లో ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అప్రమత్తమైన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించడంతో కొద్ది రోజులు చికిత్స తీసుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. తిరిగి వ్యాపారం కొనసాగిస్తున్న క్రమంలో 29న సదరు రిపోర్టర్లు నారాయణపూర్ స్కూల్ వద్ద మరోసారి లారీని అడ్డగించి రూ.20వేలు డిమాండ్ చేయడంతో పాటు డ్రైవర్‌పై దాడి చేసి, వాహనం తాళాలు, సెల్‌ఫోన్ బలవంతంగా లాక్కున్నారు. ఫిర్యాదుదారుడిపై తప్పుడు కేసులు పెట్టిస్తామని, కొడతామని బెదిరించడంతో విస్తుపోయిన అతడు శామీర్‌పేట్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

కొనసాగుతున్న గణపతి నవరాత్రులు



స్వామివారిని దర్శించుకున్న వివేకానంద యూత్ సభ్యులు

ఘట్‌కేసర్: గణపతి నవరాత్రి ఉత్సవాలు 4వ రోజు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో డాక్యుమెంట్ రైటర్ల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేయగా.. బాలాజీనగర్‌లోని డైమాండ్ యూత్ మండపం దగ్గర మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ అన్నప్రసాద వితరణ చేశారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. జంగయ్యయాదవ్, దేవేందర్‌ముదిరాజ్, రాధాకృష్ణముదిరాజ్, సహదేవ్‌ముదిరాజ్, అనిల్‌కుమార్, పొన్నయ్య, మురళి, రమేష్, శ్రీనివాస్, సురేష్, అనిల్‌గౌడ్, భానుయాదవ్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డుదారులు ఈ–కేవైసీ పూర్తి చేసుకోవాలి

డీఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని రేషన్ కార్డు లబ్ధిదారులు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తమ వేలిముద్ర సాయంతో 100 శాతం ఈ–కేవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి (డీఎస్ఓ) శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 5,37,810 రేషన్‌కార్డులకు సంబంధించి 18,65,353 మంది లబ్ధిదారులు ఉండగా.. ఇప్పటి వరకు 13,19,111 (70.72శాతం) మంది లబ్ధిదారులు మాత్రమే ఈ–కేవైసీ పూర్తి చేసుకున్నారని వివరించారు. మిగతా 5,46,242 (29.28శాతం) మంది లబ్ధిదారులు ఈ–కేవైసీని పూర్తిచేసుకోవాల్సి ఉందన్నారు. మిగిలిన వారంతా సెప్టెంబర్‌లో తాము నివసించే ప్రాంతంలో అందుబాటులో ఉన్న రేషన్‌షాపునకు వెళ్లి తమకు సంబంధించిన ఈ–కేవైసీని పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. 5 ఏళ్లు పూర్తి కాని పిల్లలకు ఈ–కేవైసీ నుంచి మినహాయింపు ఇవ్వబడిందన్నారు. రేషన్‌షాపు డీలర్లు కూడా రేషన్‌షాపులను తెరిచి ఉంచి ఈ–కేవైసీ పూర్తి చేసేందుకు సహకరించాలని ఆయన కోరారు.

వ్యక్తిగత నైపుణ్యంతోనే ఉజ్వల భవిష్యత్తు

ఓయూ ప్రొఫెసర్ డా. సురేష్‌కుమార్ లోఖండే



ఘట్‌కేసర్: విద్యార్థులు వ్యక్తిగత నైపుణ్యం పెంపొందించుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ సురేష్‌కుమార్ లోఖండే, వెంకట్‌దాస్, మోటివేషనల్ స్పీకర్ విశ్వనంద్ పట్వార్ అన్నారు. శనివారం కేపీఆర్‌ఐటీలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు నిర్వహించిన ఓరియెంటేషన్ డే వేడుకలకు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. సాంకేతిక జ్ఞానంతో పాటు నైతిక విలువలు, కృషి, ఆత్మవిశ్వాసం కీలకమని సూచించారు. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తామని, వారు తమ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని కళాశాల చైర్మన్ ప్రతాపరెడ్డి తెలిపారు. కేపీఆర్ఐటీ వైస్ చైర్మన్ ప్రశాంత్, స్ట్రాటజీ డైరెక్టర్ దివ్యశ్రీ, జీవీకే రెడ్డి, డైరెక్టర్ సుధీర్ ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణదారులకు నోటీసులు !



నిత్యానంద్, మున్సిపల్ కమిషనర్

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో అనుమతులకు మించి అదనపు అంతస్తులు నిర్మిస్తున్న భవన నిర్మాణదారులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు కమిషనర్ నిత్యానంద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలు చేపట్టి ఇబ్బందులపాలు కావొద్దని ఇంటి యజమానులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అక్రమ భవన నిర్మాణదారులపై వంద శాతం ఆస్తిపన్ను పెనాల్టీ రూపంలో ఏటా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. 'బిల్డ్ నౌ యాప్'లో స్వయంగా దరఖాస్తు చేసుకుని భవన నిర్మాణ అనుమతులను సులభంగా పొందవచ్చన్నారు. దరఖాస్తుదారులు మున్సిపల్ ఆఫీస్‌కు రావాల్సిన పనిలేదని, టౌన్ ప్లానింగ్ సిబ్బంది ప్లాటును క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారని చెప్పారు. సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు ఆస్తిపన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

'ఎమ్మార్‌సీఈ'లో ముగిసిన వర్క్‌షాప్



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని 'ఎమ్మార్‌సీఈ' కళాశాలలో 'యూత్ ఎంపవర్‌మెంట్ అండ్ స్కిల్స్'పై ఐదు రోజుల పాటు సాగిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. కళాశాల వెల్‌నెస్ క్లబ్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో సంస్థ ప్రతినిధులు దీపక్ లంక, పటేల్ ఖురానాలు వ్యక్తిత్వ నైపుణ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ.. పలు అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, వెల్‌నెస్ క్లబ్ కన్వీనర్ శాంతిలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులు స్నేహభావంతో మెలగాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మాధవీలత

మేడ్చల్‌రూరల్: ప్రతి విద్యార్థిని తమ సీనియర్, జూనియర్ విద్యార్థినులతో స్నేహ భావంతో మెలగాలని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌ఈసీడబ్ల్యూ కళాశాలలో శనివారం 'ఇంటరాక్షన్ డే'ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సీనియర్ విద్యార్థినులు జూనియర్ విద్యార్థులతో కలిసిమెలిసి ఉండాలన్నారు. సీనియర్, జూనియర్ల మధ్య అనుబంధం భవిష్యత్ వికాసానికి ఎంతో అవసరమన్నారు. క్రమశిక్షణతో ముందుకు సాగితే భవిష్యత్తులో లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చన్నారు. విద్యార్థినులు ఫ్యాషన్ షో, డ్యాన్స్, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

నిమజ్జనానికి వేళాయె !



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, పోలీసు ఉన్నతాధికారులు

17 చెరువుల్లో సర్వం సన్నద్ధం

- ప్రతి చెరువు వద్ద రెండు క్రేన్లు, గజ ఈతగాళ్లు
- నోడల్ అధికారుల పర్యవేక్షణలో విధుల నిర్వహణ
- 2000 మంది పోలీసులతో బందోబస్తు

సాక్షి,మేడ్చల్ జిల్లా: గత 4 రోజులుగా పూజలందుకుంటున్న గణనాథుడు నేడు ఐదవ రోజు నుంచి నిమజ్జనానికి తరలే సమయం ఆసన్నమైంది. శోభాయాత్ర మొదలు చెరువుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేంత వరకు నిర్వాహకులు సమష్టిగా ముందుకు సాగాల్సి ఉంటుంది. ఎలాంటి అపశృతులు చోటు చేసుకోకుండా పోలీస్, పురపాలక, రెవెన్యూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళిక సిద్ధం చేశారు. నిమజ్జనానికి 17 చెరువులను గుర్తించి ఏర్పాట్లు పూర్తి చేశారు.

- జిల్లా వ్యాప్తంగా దాదాపు 35 వేల వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాటు చేశామని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి వివరించారు.

పోలీసులతో బందోబస్తు..

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రెండు వేలమంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి చెరువు వద్ద రెండు క్రేన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇద్దరు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

- చెరువుల వద్ద విద్యుత్ లైటింగ్, తాగునీటి వసతితో సహా 10 మంది సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

- పోలీసు పికెట్, మెడికల్ క్యాంపు, ఫైర్ ఇంజిన్, కరెంటు సౌకర్యాలను కల్పించారు. భక్తులకు టాయిలెట్లు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు .
- నిమజ్జనంలో ఎలాంటి అపశృతులు చోటు చేసుకోకుండా 17 చెరువుల వద్ద ప్రత్యేక అధికారులుగా మున్సిపల్ కమిషనర్లు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లను జిల్లా కలెక్టర్ నియమించారు.

నిర్వాహకులకు కొన్ని జాగ్రత్తలు...

చిన్న గణనాథులను నిర్వాహకులు తీసుకెళ్తే మేలు. బరువు ఎక్కువగా ఉన్న విగ్రహాలను భారీ క్రేన్ సాయంతో వాహనంపై ఎక్కించాలి. గణనాథుడిని వాహనానికి మోసుకెళ్లే సమయంలో ఊహించని ఘటన జరిగితే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. శోభాయాత్రలో వాహనంపై చిన్న పిల్లలుంటే వారిని జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉంటోంది.

సూచించిన రూట్‌మ్యాప్‌లోనే..

ప్రతి గణేష్ మండపానికి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వరుస సంఖ్య కేటాయిస్తారు. నిర్వాహకులు భారీ విగ్రహాలతో మధ్యలో చేరితే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. పోలీసులు సూచించిన రూట్ మ్యాప్‌ను అనుసరించి, నిర్దేశించిన మార్గాల్లోనే వెళ్లాల్సి ఉంటుంది.

డీజే శబ్దాలకు..

శోభాయాత్రలో భారీ తరహా డీజే శబ్దాలు పెడుతూ.. యాత్రలో ఇబ్బందులు కలిగిస్తే ఉత్సవాలు గాడి తప్పే వీలుంది. 12 అడుగుల డీజే పరికరం 75 డెసిబుల్స్ మించి శబ్దం వినిపిస్తే పోలీస్‌శాఖ కేసులు పెట్టే అవకాశం ఉంటుంది. నిమజ్జనం పూర్తి చేసిన తర్వాత మండపానికి సంబంధించిన నిర్వాహకులంతా ఒక చోట చేరి, నిమజ్జన యాత్రకు వచ్చిన వారందరూ.. ఉన్నారా..? లెక్క చూసుకోవాలి. క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని పెద్దలు, పోలీసు అధికారులు చెబుతున్నారు.

- విద్యుత్ తీగలను సరిచేయడానికి సంబంధిత అధికారుల సాయం తీసుకోవాలి. ఎక్కువ మంది చెరువు లోపలికి వెళ్తే గందరగోళానికి గురయ్యే అవకాశం ఉంది. చిన్నారులు నీళ్లల్లో జారిపడే ప్రమాదం ఉంది. క్రేన్ ఎక్కి చెరువులోనికి వెళ్లే ప్రయత్నం చేయకూడదని హెచ్చరించారు.